


అతను గత నాలుగు రోజులుగా సీతని వెంటాడుతున్నాడు.

ఆమె కనీసం ఒక్కసారన్నా అతన్ని చూసిన పాపాన పోలేదు.

ఇహ లాభం లేదని ఓ నిర్ణయానికొచ్చేశాడా రోజున.

విసురుగా ఆమె ముందు కొచ్చేసి చెయ్యి పట్టుకున్నాడు.

తొలినుంచీ ఈ భాగోతం చూస్తూనే వున్నారు ఆ టీ బంకు వద్ద కూర్చొనున్న ఆ నడివయస్సు పెద్ద మనుషులు.

అందరూ ఒక్కుమ్మడిగా పైకి లేచారు.

ముందుకు నడిచారు ఆవేశంగా.

సీత అతన్నే సూటిగా చూసింది.

చెయ్యి లాక్కుంది.

ఈసారి ఆమె రెండు చేతులూ పట్టుకుని ఏదో చెప్పబోతున్నాడు.

అతనికా అవకాశం ఇవ్వకుండా... అతన్ని ఇవతలకి లాగి తలా ఓ దెబ్బేశారు.

సీత వాళ్ళని వారించి అతన్ని విడిపించింది. అతను పాపం మౌనంగా వుండి పోయాడు.

"రాస్కెల్ మేం మనుషులం దనుకున్నావా? పాపం భర్త వొదిలేసిన దిగుల్తో ఈ కాలనీలో పరుల ఇంట తలదాచుకుని తన జీవితం తను జీవిస్తున్నది గౌరవనీయంగా. రోజూ వెంటబడుతున్నావే! కనీసం నీ వైపు చూడను కూడా లేదు. మా కళ్ళముందే ఇలా బలాత్కారం చేస్తావా? ఇలా చూస్తూ వుంటే కిడ్నాప్ చేసెత్తుకెళ్ళేవాడివనుకుంటా రావణుల్లా. ఎవర్నువ్వు? ఏరీ నీ ముఠావాళ్ళు" అంటూ చొక్కా పట్టుకున్నారు. అప్పటికి నోరు విప్పాడు. అతని మొహంలో బాధలేదు. అవమానపు చిహ్నాలు లేవు.

"క్షమించండి. మరోసారి ఇలాంటి పని ఎవరిపట్లా ఎక్కడా ఎప్పుడూ చెయ్యనుగాక చెయ్యను. నా కళ్ళు తెరిపించారు. కృతజ్ఞతలు"

అని అదే పరుగు.

ఓ వారం తరువాత.

అదే టీ బంకు వద్ద కూర్చుని తమ కాలనీ గొప్పని గురించి, విలక్షణత గురించి కబుర్లాడుకుంటున్న ఆ నడివయస్సు పెద్ద మనుషులు –

ఆ దృశ్యాన్ని చూసి ఆశ్చర్య పోయారు.

క్రమంగా కోపం ఆపై అవమానం కలగలిపి ఉక్రోషం – వాళ్ళని వూపేస్తున్నది.

సీత మరియు అతను!

చాలా ఆత్మీయంగా నడచి వస్తున్నారు! వాళ్ళిద్దరి మెడల్లో పూలదండలు!!

అడ్డుగా నిలిచి వాళ్ళని నిలేశారు.

"ఆగూ..."

అంటూ సీతని హుంకరించారు.

"నీవెంతో యోగ్యురాలివని నమ్మి అతన్ని కొట్టాము. తాత్కాలిక విభేదాలతో శాశ్వతంగా భర్తనొదిలేసి – ఈ రోడ్‌సైడ్ రోమియోతో పవిత్రమైన మా కాలనీలోనే కాపురం చెయ్యబోతున్నావా? వీల్లేదు. మిమ్మల్ని చూసి మిగతా వాళ్ళూ చెడిపోతారు. పదేళ్ళుగా ఈ కాలనీ చాలా పవిత్రంగా వుంది. మొన్న ప్రారంభమైంది నీ కారణంగా, అది ఈ రోజుతో అంతం కావాలి, వెనక్కెళ్ళిపోండి"

అన్నారు ఏకకంఠంతో.

చాలా నింపాదిగా ఆహ్లాదంగా అన్నదిలా:

"మీ అభిమానానికీ ఆగ్రహానికీ మా కృతజ్ఞతలు. మీలాంటి రక్షకుల్నీ ఈ తల్లివొడిలాంటి కాలనీనీ వొదిలెక్కడికీ వెళ్ళం. మమ్మల్ని ఆశీర్వదించండి. చెప్పుడు మాటలు విని అనుమానంతో విడాకుల కోసం కోర్ట్‌కెక్కాడు నా భర్త. .. అతన్నొదిలేశాను తప్పా? మీ ద్వారా జ్ఞానం పొంది చెంపలేసుకున్న ఈ నా మాజీ భర్తని మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మీ కాలనీకి గర్వకారణం కాదంటారా?"

"... ... ..."

●